"మేడం దయానా"

శశిభూషణ్

"బజ్ జ్..." మంటూ మ్రోగింది ఇంటర్ కామ్.

భారత ఇంటిలిజెన్స్ శాఖ స్పెషల్ బ్రాంచ్ రీజియనల్ డైరెక్టర్ మిస్టర్ నేతాజీ ఇంటర్ కామ్ స్విచ్ ఆన్ చేసాడు. "యస్?" అడిగాడు.

"డిటెక్టివ్ చందూర్ గారు, ఆయన అసిస్టెంట్ వచ్చారు, సార్!" చెప్పింది రిసెప్షనిస్ట్.

"వెల్! లోనికి పంపించు" స్విచ్ ఆఫ్ చేసి సిగరెట్ వెలిగించుకున్నాడు నేతాజీ.

స్ప్రింగ్ డోర్ తెరుచుకుంది. ఇద్దరు యువకులు లోనికొచ్చారు. వారిలో ఒకతనికి ఇరవైఏడు సంవత్సరాలుంటుంది వయసు. రెండో అతనికి పాతిక మించి వుండదు.

చటుక్కున లేచాడు నేతాజీ. సూట్‌వాలాతో కరచాలనం చేసాడు. "మిస్టర్ చందూర్! సమాచారం అందిన వెంటనే వచ్చినందుకు సంతోషం!" తల తిప్పి రెండో వ్యక్తిని చూసాడు. "మిస్టర్ ప్రతాప్! హౌడు యు డూ?"

"ఫైన్."

డిటెక్టివుల్ని కూర్చోమని చెబుతూ తన సీట్లో రిలాక్స్ అయ్యాడు నేతాజీ.

సిగరెట్ వెలిగించుకుని బలంగా దమ్ము లాగాడు చందూర్. "మెస్సేజ్‌తోబాటు కోడ్ వర్డ్సు కూడా పంపించారు. అంటే విషయం చిన్నది కాదన్నమాట. ఏమిటది?" అడిగాడు.

ఎగశ్వాస పీల్చి వదిలాడు నేతాజీ. "విషయం పెద్దదే. ఈ ఎసైన్‌మెంటులో మీ ప్రాణాలు పోయే అవకాశం ఎక్కువగా వుంది. అందుకే ఆలోచిస్తున్నాను."

మందహాసం చేసాడు చందూర్. "మిస్టర్ నేతాజీ! మనిషి రెండుసార్లు మరణించడు. టేకిట్ ఈజీ."

నేతాజీ భారంగా నిట్టూర్చి చెప్పసాగాడు.

"ప్రతి దేశంతోను సంబంధ బాంధవ్యాలు కల్గిన అంతర్జాతీయ గూఢచారుల ముఠా ఒకటి ప్రపంచం నలుమూలలా తిరుగుతోంది. ఆ ముఠాలో డయానా సభ్యురాలిగా వుంటోందని మనకు తెలుసు.

ఆ ముఠాని కమాండ్ చేస్తున్నది ఎవరు? ఇటు మనకు అటు ఇంటర్‌పోల్‌కి అర్థంకాని విషయమది.

పదిరోజుల క్రితం ఇంటర్‌పోల్ క్రైమ్స్ ఇన్వెస్టిగేటర్ ఒకతను సాలిస్‌బరి నుంచి సమాచారం అందజేసాడు

హెడ్డాఫీసుకు. డయానా ప్రస్తుతం ఇండియాలోనే వుందనీ, డయానా పనిచేస్తున్న సీక్రెట్ ఆర్గనైజేషన్ కీలక స్థానం సాలిస్‌బరి అయివుండాలని తను అనుమా నిస్తున్నట్టు తెలిపాడు. తన పూర్తి రిపోర్ట్‌ను మరొక వారంరోజుల్లో పంపుతానన్నాడు. కాని, తర్వాత అతని వద్దనుంచి యెటువంటి సమాచారం అందలేదు.

కాగా, నిన్న సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌వారి స్పెషల్ ఫ్లైట్ యిక్కణ్ణుంచి బయలుదేరింది. అది బాంబే చేరాలి. నిర్ణీత సమయానికి చేరలేకపోయింది.

ప్లేన్ పాలం ఎయిర్‌పోర్ట్‌నుండి టేకాఫ్ అయిన ఐదు నిమిషాల తర్వాత పాలం విమానాశ్రయానికి ప్లేన్‌కి టెలీ కమ్యూనికేషన్స్ తెగిపోయాయ్.

ఆ తర్వాత శాంతాక్రజ్ ఎయిర్‌పోర్టుకి దాని సంగతే తెలియలేదు.

నిమిషాలమీద సెర్చ్ పార్టీ సిద్ధమైంది. పది హెలికాప్టర్లు ఆ ప్లేన్‌కోసం గాలింపు చర్యలు ప్రారంభించాయ్.

అదృశ్యమైపోయిన ప్లెయిన్‌లో అటమిక్ రీసెర్చి సెంటర్‌కి చెందిన ఒక ఛీఫ్ సైంటిస్ట్ ఆఫీసర్ వున్నాడు. పేరు భరద్వాజ. పోంఖరిన్‌లో మన అణుబాంబు ప్రయోగం జరుగటానికి వెనుక ఆయన శ్రమ చాలా వుంది. మిస్టర్ భరద్వాజ పాత్ర లేకంటే మన అణుపాటవ పరీక్ష యింత త్వరగా ముగిసేది కాదు.

సైంటిస్ట్ భరద్వాజ అదృశ్యం కావటానికి, డయానా కారకురాలై వుంటుందా? ఆమె పనిచేస్తున్న సీక్రెట్

ఆర్గనైజేషన్ హెడ్డాఫీస్ సాలిస్‌బరిలో వుందా? అసలు డయానా భారతదేశంలోకి యెందుకు ప్రవేశించింది? సెంటిన్స్ అపహరణ విషయంలో డయానా పాత్ర లేకుంటే ఆ ప్లెయిన్‌ని హైజాక్ చేసింది యెవరు? ప్లెయిన్ హైజాకర్స్ చేతుల్లో కాకుండా ఏదైనా ప్రమాదంలో యిరుక్కుందా? ప్రస్తుతం భరద్వాజ యెక్కడున్నాడు? ఎలా వున్నాడు?

"మిస్టర్ చందూర్! ఇవి సమస్యలు. ఇహ మనం చేయవల్సిందేమిటో మీరే నిర్ణయించండి!" చెప్పటం ఆపి సిగరెట్ వెలిగించుకున్నాడు నేతాజీ.

చందూర్ కుర్చీలో వెనక్కు వాలాడు.

"డయానా గురించి విన్నానంతే! ఆమెను యింతవరకు నేను చూళ్లేదు. ఆవిడ ఫోటో, వివరాలు మీకు అంది వుంటాయ్. ఆమె వివరాలు చెప్పండి."

తల అడ్డంగా ఊపాడు నేతాజీ. "ఆవిడ ఫోటో లేదు.ఆమెగురించి మీకు నేను చెప్పగలిగిన వివరాలుకూడా చాలా తక్కువ. నాకు అందిన సమాచారం ప్రకారం డయానా ఇరవైమూడు సంవత్సరాల యువతి. ఐదడుగుల నాలుగు అంగుళాల ఎత్తు. పసుపుపచ్చని శరీరం, చురుకైన కళ్ళు, గుండ్రటి ముఖం, ఆకర్షణీయమైన గుండ్రటి వక్షసంపద, రాగి వర్ణంలో మెరిసే తల వెంట్రుకలు, ఎక్కువగా చిరునవ్వులు చిందించటం ఆమెలోని ప్రత్యేకత."

"మీరు చెప్పిన వివరాలు చాలవు. చాలామంది యువతులు ఆమెలాగే వుంటారు."

ఇబ్బందిగా నవ్వాడు నేతాజీ. "ఆమె గురించి అంత

కంటే తెలియదు. ఆవిడ ఎక్కడ పుట్టిందో అసలే తెలియదు.''

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినవాడిలా తిరిగి చెప్పసాగాడు నేతాజీ. ''డయానా గురించి మరొక్క విషయం చెప్పగలను. ఆమె ఎడమచేతికి ఆరు వ్రేళ్ళు వున్నాయ్. చిటికెన వ్రేలు ప్రక్కన మరొక చిన్న వ్రేలుంది. అది రెండు సెంటిమీటర్ల పొడవు వుంటుందట.

ఆ సంగతి ఆమెతో పరిచయం సంపాదించ గలిగిన ఇంటర్‌పోల్ డిటెక్టివ్ తెల్సుకో గలిగాడు. అతన్ని పన్నెండు ముక్కలుగా నరికి ఇంటర్‌పోల్ డైరెక్టర్ జనరల్‌కి బహుమానంగా పంపించింది డయానా నలభై రోజుల క్రితం.''

''ఇట్సాల్ రైట్! నేను సాలిస్‌బరి వెళ్తాను. ప్రతాప్ లండన్ వెళ్ళి ఇంటర్‌పోల్ డైరెక్టర్ జనరల్‌ని కల్సుకుంటాడు. ముందు డయానా సంగతి తేలిస్తే, కేసంతా విడిపోతుందని నా నమ్మకం'' అన్నాడు చందూర్.

''మీ పరిశోధన వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తుండండి. సాలిస్‌బరిలోని ఇంటర్‌పోల్ బ్రాంచ్ మీకు అన్నివిధాలా సహకరిస్తుంది. విష్ యు బెస్టాఫ్ లక్‌లాట్!'' అంటూ చందూర్‌తో కరచాలనం చేసాడు నేతాజీ.

2

ఢిల్లీనుంచి బయలుదేరిన ఇంటర్నేషనల్ ఫ్లైట్, టెహరాన్, అంకారా, పారిస్‌ల మీదుగా లండన్ చేరుకుంది.

సుదీర్ఘ ప్రయాణం కావటంతో ప్రతాప్‌కి కొద్దిగా విసుగు కలిగింది. హీత్రో ఎయిర్‌పోర్టునుండి బయటకు

వచ్చాడు. నల్లటి సూట్‌లో స్మార్టుగా కన్పిస్తున్నాడు.

సమయం బ్రిటన్ కాలమానం ప్రకారం ఉదయం ఎనిమిది గంటలు. చలిచలిగా వుంది వాతావరణం. నవంబర్ నెల కావటంతో మంచు పల్చగా కురుస్తోంది.

ఎయిర్‌పోర్టునుండి బయటకొచ్చిన ప్రతాప్ సిగరెట్ వెలిగించుకుని, బలంగా దమ్ము లాగాడు.

గుర్రున దూసుకొచ్చి అతని ప్రక్కన ఆగింది ఓ ఇంపాలా కాబ్.

కాబ్ బాక్ సీట్లో కూర్చున్నాడు ప్రతాప్. హైడ్ పార్క్ ప్రాంతంలోని "ఇండియన్ రెస్టారెంటు"కి వెళ్ళమన్నాడు.

కాబ్ ఇండియన్ రెస్టారెంటు చేరుకుంది. ప్రతాప్ లండన్ రావటం యిది మొదటిసారి కాదు. ఫేర్ చెల్లించి, రెస్టారెంటులోకి నడిచాడు.

బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని, అక్కడకు సమీపంలో నున్న ఇంటర్‌పోల్ హెడ్డాఫీసుకి కాలినడకన బయలు దేరాడు.

సమితిలో సభ్యత్వం కలిగిన అన్నిదేశాలకు ఇంటర్ పోల్ వర్తిస్తుంది. ఐదుగురు డైరెక్టర్లు, ఒక డైరెక్టర్ జనరల్ కలిగిన సీక్రెట్ ఆర్గనైజేషన్...ఇంటర్‌పోల్. దాని బ్రాంచీలు ప్రపంచం నలుమూలలా వున్నాయ్.

ఐదంతస్తుల ఇంటర్‌పోల్ కార్యాలయం ముందు కెళ్ళాడు ప్రతాప్. మెయిన్‌గేటు ముందున్న సెక్యూరిటీ గార్డ్సుకి తన ఐడెంటిటీ చూపించాడు.

ప్రతాప్ సెక్యూరిటీ కాప్టన్‌వద్దకు తీసుకెళ్ళబడ్డాడు.

ఆ కాప్టన్ ఆఫ్రికన్ నీగ్రో. పేరు జోమా.

తోమా తన సబార్డినేట్స్‌కి సైగ చేశాడు. ప్రతాప్ సోదా చెయ్యబడ్డాడు. చివరికి అతనివద్ద సిగరెట్ పెట్టె, లైటర్ కూడా లేకుండా తీసేసుకోబడ్డాయ్.

ఇంటర్‌పోల్ డైరెక్టర్ జనరల్ మిస్టర్ సోవెస్కీ, ప్రతాప్‌ని చూస్తూనే మందహాసం చేసాడు.

"వెల్, మై డియర్ యంగ్ స్పై! టేక్ యువర్ ఛెయిర్" అన్నాడు. అతను సోవియెట్ దేశస్థుడు. కంఠం గంభీరంగా వుంది.

థాంక్స్ చెప్పి, జనరల్ చూపించిన కుర్చీలో కూర్చున్నాడు ప్రతాప్. అరగంటపాటు వారి మధ్య సంభాషణ సాగింది.

ఆఖరుకు జనరల్ అన్నాడు. "వెల్, మిస్టర్ ప్రతాప్! అటు సభ్యదేశాలకు, ఇటు ఇంటర్‌పోల్‌కి ఒక పజిల్‌గా తయారైవున్న డయానా విషయం తేల్చెయ్యటానికి భారత దేశానికి చెందిన ఇద్దరు ప్రయివేట్ ఇన్‌వెస్టిగేటర్స్ పూనుకోవటం నాకెంతో ఆనందంగా వుంది. విష్ యు ఆల్ ది బెస్ట్. మీకు ఏం సహాయం కావాలన్నా చెయ్యటానికి ఇంటర్‌పోల్ సిద్ధంగా వుంది."

"థాంక్యూ, సర్! డయానాకు, ఆమెను ఆదరిస్తున్న సీక్రెట్ ఆర్గనైజేషన్‌కి సంబంధించిన వివరాలు మీ శాఖ సేకరించి వుంటుంది. ఆ ఫైల్ కావాలి!"

"డెఫినెట్లీ..." ఇంటర్‌కామ్ స్విచ్ ఆన్ చేసి, ఎవరికో ఏదో చెప్పాడు జనరల్.

రెండు నిమిషాల్లో ఓ ఫైలు బల్లమీదకు చేరింది.

పది నిమిషాలపాటు ఫైల్ తిరగేసాడు ప్రతాప్. దీర్ఘంగా గాలి పీల్చి వదులుతూ ఫైల్లోంచి తలెత్తాడు.

"ఈ ఫైల్లో ఎక్కువ వివరాలు లేవ్. సభ్యదేశాల గూఢచారు లందరికీ తెల్సిన విషయాలు మాత్రమే వున్నాయ్" అన్నాడు నవ్వుతూ.

"యస్! ఇంటర్ పోల్ ఎంత ప్రయత్నిస్తున్నా—అ ముతా వివరాలు, దాని హైకమాండ్ పోస్టని నిర్వ రిస్తున్న వ్యక్తి వివరాలు తెల్సుకోలేకపోతోంది. బై ది బై—డయానా మీకు చిక్కితే ఆమెను మా శాఖకు అప్పగించే ప్రయత్నం చెయ్యండి."

"ప్రయత్నిస్తాం. డయానా సాధారణమైన ఆడది కాదు. కర్తవ్య నిర్వహణలో తన్ను తాను బలి పెట్టుకోవ టానికి సైతం వెనుకాడని డేరింగ్ లేడీ."

అని కొన్నిక్షణాలు మౌనంగా వుండిపోయాడు ప్రతాప్.

"నేను సాలిస్ బరి వెళ్ళి మిస్టర్ చందూర్ ని కల్సుకో వాలి. అందుకు కావల్సిన ఏర్పాట్లు చెయ్యమని కోరు తున్నాను."

"ష్యూర్...ష్యూర్..." బల్లమీదున్న ఫోన్ అందు కున్నాడు జనరల్. "హాలో ట్రాన్స్‌పోర్ట్..."

ప్రతాప్ కుర్చీలో వెనక్కు వాలాడు.

3

సాలిస్ బరి ఎయిర్ పోర్టులో ప్లెయిన్ దిగిన చందూర్ ని ఎవరూ అనుమానించలేదు. అతను టూరిస్ట్‌లాగా ప్యాసిం జర్స్ ఫ్లైట్లో ప్రయాణించి వచ్చాడు.

రొడీషియా ఆఫ్రికన్స్‌తో నిండివున్నా అక్కడ శ్వేత జాతీయులు దాదాపు 270 వేలమంది వరకు వున్నారు. శ్వేతజాతి ప్రజలున్న ప్రాంతాలలో వర్ణజాతులు, యూవ

జనులు ప్రదర్శనలు జరుపుతున్న రోజులవి.

అల్లరు అణచటానికి పోలీసులు టియర్ గ్యాస్, రివా ల్వర్లు, షాట్ గన్స్ ఉపయోగిస్తున్న సమయం. అల్ప సంఖ్యాకులైన తెల్లజాతివారి చేతుల్లోంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి నల్లజాతివారు ప్రత్యక్ష పోరాటాలు, గొరిల్లా యుద్ధాలు, అలజడులు జరుపుతున్న గడ్డు క్షణాలవి.

చందూర్‌తో పాటు మిగిలిన ప్రయాణీకులు కూడా కస్టమ్స్ గొడవలు ముగించుకొని, ఎయిర్ పోర్ట్ నుండి బయట పడ్డాడు.

ఎయిర్ పోర్ట్ లోపల, వెలుపల...ఎక్కడ చూసినా సాయుధ సైన్యం అప్రమత్తతతో మెలుగుతోంది. సైరన్లు వూదుకుంటూ పోలీస్ పెట్రోల్ వాన్స్ వీధుల వెంట పిచ్చికుక్కల్లా పరుగులు దీస్తున్నాయ్.

అఫ్ఘన్ కుర్ద్ జాతివాడిలా కనిపిస్తున్నాడు చందూర్. కుర్తా, లాల్చీ, పైన వూఫ్ కోటు, తలకు పెద్ద తలపాగా ధరించాడు. భుజానికి ఎయిర్ బేగ్ వ్రేలాడుతోంది. గుబురుగా పెరిగిన గడ్డం, మెలి తిరిగిన మీసాలు, చేతికి పెద్ద స్టీలు కడియం...నల్లటి రెయిబాన్ గ్లాసెస్ వెనుక చురుగ్గా కదిలే కనుపాపలు బయటకు కన్పించటం లేదు.

ప్రపంచం నలుమూలలా వుండే స్కిన్ ట్రేడర్స్ ఆఫ్రికన్ రాజ్యాలతో డీలింగ్స్ కలిగి వుంటారు. ఆఫ్రికన్ రాజ్యాల్లో చిక్కని జంతు చర్మాలు ప్రపంచంలో మరెక్కడా దొరకవు.

టాక్సీలో బయలుదేరాడు డిటెక్టివ్ చందూరు. ఏదైనా

హోటల్లో బస చెయ్యటం అతని కిష్టం లేదు. హోటల్లో బస చెయ్యటం వలన అనేక రకాలైన ప్రమాదాలు ఎదుర్కో వలసి వుంటుందని అతనికి తెలుసు.

అంతే కాదు. ఆ సమయంలో సాలిస్‌బరీలో పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే వున్నాయ్. స్థానిక ప్రజలే ప్రతి క్షణం చచ్చి బ్రతుకుతున్నారు భయంతో.

నగరం మధ్యలోనున్న ఓ సందు కివతలగా టాక్సీ ఆపించాడు.

వాహనాలు ప్రవేశించడానికి వీలు లేని సందు అది. సందు కిరువైపులా భవనాలు కన్పిస్తున్నాయ్.

ఏభై గజాలు నడిచి ఎడమ చేతివైపున్న ఓ భవనం ముందాగాడు చందూర్.

అది రెండంతస్తుల భవనం. ఆధునికంగా కన్పిస్తోంది.

డిటెక్టివ్ కాలింగ్ బెల్ స్విచ్ నొక్కాడు. అర నిమిషం ఆగి మళ్ళీ నొక్కాడు.

పదిహేను సంవత్సరాల నీగ్రో పనిపిల్ల తలుపు తెరిచింది.

"హూ ఆర్ యూ?" అడిగింది ఇంగ్లీష్‌లో.

రొడీషియాలో తెల్లజాతి వారు వున్నది తక్కువ సంఖ్యే అయినా వారి సంస్కృతి అంటురోగంలా ఎక్కడ చూసినా కన్పిస్తుంటుంది. వేష భాషలు మొదలుకొని హావభావాల వరకు గ్రేట్ బ్రిటన్ సంస్కృతి అక్కడ ప్రజల్లో జీర్ణించుకుపోయింది.

"బేబీ; దాదాముల్లా కాబూల్ నుండి వచ్చాడని జెనీసాకు తెలియజెయ్!" చెప్పాడు చందూర్ ఇంగ్లీషులోనే.

ఆ పిల్ల చందూర్‌ని లోనికి ఆహ్వానించింది. హాల్లో

నున్న సోఫా చూపించి, కూర్చోమంది.

"సర్! మీరు ఏం బిజినెస్ చేస్తారు? మేడమ్ జెనీసా అడిగితే చెప్పాలి కదా!" అంది నవ్వుతూ.

"స్కిన్ ట్రేడర్ని. దాదాముల్లా అనే పేరు చెబితే చాలు. ఆమెకు నేను బాగా తెల్సు. వెళ్ళు!"

పని మనిషి వెను దిరిగి మేడ మెట్లు ఎక్కి అదృశ్య మైంది.

హై హీల్డ్స్ టక టక లాడించుకుంటూ మేడ మెట్లు దిగి వచ్చింది జెనీసా. చందూర్ని కాసేపు పరిశీలనగా చూసింది.

"మిస్టర్ చందూర్! హావ్ డు యు డూ?" అంది నవ్వుతూ.

ఆశ్చర్యపోలేదు చందూర్. తను మారు వేషంలో వున్నా జెనీసా పోల్చుకో గల్గింది. అంతటి సమర్థురాలే ఆమె.

"జెనీసా! అలా కూర్చో!" తన ఎదురుగా నున్న ఖాళీ సోఫాని చూపించాడు డిటెక్టివ్.

అందంగా నవ్వి చందూర్ ప్రక్కనే కూర్చుంది జెనీసా. "ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు సరిగా లేవ్. అంతర్యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఎందుకొచ్చారు మీరు? ఎవరినైనా శత్రు గూఢచారిని వెంటాడుతూ ఇలా వచ్చారా?"

తన పెదవుల మీద ముద్దు పెట్టుకుంటున్న జెనీసాని వారించలేదు డిటెక్టివ్.

"నువ్వు ఇక్కడ సాలిస్బరీలో వుంటున్నావని రెండు నెలల క్రితం తెలిసింది. నేను వచ్చేసరికి మరొక దేశానికి

వెళ్ళిపోయి వుంటావేమో నని భయపడ్డాను. ఒక సమస్య తీరింది. మిస్ జెనీసా! నీ సహాయం కొంతకావాలి నాకు."

"చెప్పండి."

"కొద్ది రోజుల పాటు నువ్వు ఎవ్వరికీ ఎపాయింట్ మెంట్ యివ్వకూడదు. నీ ఎంగేజ్ మెంట్స్ అన్నీ కాన్సిల్ చేసుకోవాల్సివుంటుంది. నేను యిక్కడున్నంత వరకు ఎవరూ ఈ యింటి గుమ్మం తొక్కకూడదు."

సిల్క్ రోబ్ లో వున్న జెనీసా చిలిపిగా నవ్వి ఒళ్ళు విరుచుకుంది.

"నన్ను గుర్తుంచుకొని, నా కోసం వెతుక్కుంటూ యింత దూరం వచ్చారంటే నాకెంతో గర్వంగావుంది. మీరు చెప్పినట్లే జరుగుతుంది. కాని, నా బిజినెస్ దెబ్బ తినే ప్రమాదం వుంది. ఈ సారి చెల్లించాల్సిన బిల్లు పెద్ద మొత్తం అవుతుందేమో!"

"డోంట్ బాదర్. నువ్వు కోరిన మొత్తం యిస్తాను. జెనీసా! నేను వచ్చింది నీకోసం కాదు వివరాలు అడగొద్దు. నాకో గది ఏర్పాటు చేస్తావా?"

"వై నాట్...విత్ ప్లెజర్, డార్లింగ్!" జారి పోతున్న సిల్క్ రోబ్ ని సరిచేసుకుంటూ, లేచి నిల్చుంది జెనీసా. చందూర్ వృత్తి గురించి ఆమెకు తెలుసు.

4

ప్లేన్ రొడేషియా, భూభాగం మీదకు దూసు కొచ్చింది. దాన్ని కంట్రోల్ చేస్తున్న వ్యక్తి ఇంటర్ పోల్ సెక్యూరిటీ కాప్టెన్ జోమా. అతని ప్రక్కనే ప్రతాప్ వున్నాడు.

అది రష్యన్ మిగ్-25 జెట్ ఫైటర్. అత్యంత శక్తి వంతమైన యుద్ధ విమానం. దాని వేగం గంటకు 3395 కిలోమీటర్లు. ప్రతాప్‌ని త్వరగా రొడోషియా చేర్చటానికి ఆ విమానం కేటాయించబడింది.

విండో గ్లాస్ గుండా బయటకు చూసాడు ప్రతాప్. నీరెండలో తళ తళ మెరుస్తున్నాయ్ క్రింద ఏవో పర్వత చరియలు. సాయంత్రం సమయం.

ప్లేన్‌ని ఆటోపైలెట్‌లో మాగ్జిమమ్ స్పీడ్‌కి ఫిట్ చేసి, పారాచూట్ బిగించుకున్నాడు జోమా.

అతని చర్యలు ప్రతాప్‌కి ఆశ్చర్యాన్ని కల్గించాయ్. "మిస్టర్ జోమా! ఏమిటి నువ్వు చేస్తున్నది?" కుతూహలాన్ని-అణచుకోలేక అడిగాడు.

సమాధానంగా నవ్వాడు జోమా. కంట్రోల్ స్టిక్ మీద చేయివేస్తూ, ఫుల్ ఎక్సిలరేషన్‌లో పదివేల అడుగుల ఎత్తుకు విమానాన్ని తీసుకెళ్ళాడు.

ప్రతాప్ సిక్స్త్ సెన్స్ ఏదో ప్రమాదాన్ని సూచించే వార్తల్ని ట్రాన్స్‌మిట్ చెయ్యటం మొదలుపెట్టింది. పరిస్థితి అర్థం కావటం లేదు ప్రతాప్‌కి.

"జోమా! వాట్స్‌ది మేటర్" అరిచాడు.

"మై డియర్ ప్రతాప్! యు ఆర్ గోయింగ్ టు డై!" తాపీగా చెప్పాడు జోమా.

"వాడ్డు యు మీన్?"

నవ్వాడు జోమా. "ధైర్యం వుంటే విను. నేను మేడమ్ దయానా మనిషిని. ఆ విషయం ఇంటర్ పోల్‌కి తెలియదు. గుడ్ బై!"

అదిరి పడ్డాడు ప్రతాప్.

సట్ ఎజక్యూటర్ బటన్ నొక్కాడు జోమా. చటుక్కున అతను సట్‌తో సహా స్ప్రింగ్‌లా ప్లేన్‌లోనుండి ఆకాశంలోకి విసరివేయబడ్డాడు.

ఆ తర్వాత జోమా ఏమయ్యాడో ప్రతాప్‌కి తెలియదు. అతను చావడు. అప్పటికే పారాచూట్ బిగించుకొని వుండటంతో క్షేమంగా భూమ్మీద లాండ్ కాగలడు.

చటుక్కున కంట్రోల్స్‌ని స్వాధీనం చేసుకున్నాడు ప్రతాప్. అప్పుడు గ్రహించాడు వింగ్స్ రెండూ మండుతుండటం. ఫైర్ ఎక్స్‌టింగ్ విషర్ బటన్ నొక్కాడు. అది పని చెయ్యటం లేదని అర్థమైంది.

ప్రతాప్ గుండెలు దడదడలాడాయ్. జోమా ప్రత్యర్థుల మనిషి అయి వుంటాడని తను వూహించనైనా లేదు. బాస్టర్డ్...మరొక పారాచూట్ వుందేమోనని గబగబ ప్లేన్‌లో వెతికాడు. అతని ఆఖరు ప్రయత్నంకూడా ఫెయిల్ అయ్యింది.

అది జీవన్మరణ సమస్య.

ప్లేన్ వణికిపోతూ యిష్టమొచ్చినట్టు ముందుకు దూసుకెళ్తోంది. అది ఏ క్షణంలోనైనా తల క్రిందులు కాగలదు.

మంటలు వ్యాపించటానికి జోమా ఏదో చేసివుంటాడు. అతని మీద ఎటువంటి అనుమానం లేకపోవటంతో తను ఫూల్ అయిపోయాడు. జోమా ప్రయత్నాల్ని పసిగట్టలేకపోయాడు.

అప్పటి వరకు ఫ్యూయల్ టాంకులు అంటుకోక పోవటంతో అటువంటి క్షణాల్లోకూడా ఒక్క క్షణం సంతోషించాడు ప్రతాప్.

శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నాడు. ప్లేన్ని కంట్రోల్ చెయ్యాలని చూస్తున్నాడు. అతని డైరెక్షన్ ప్రకారం కాకుండా జారిపోయే ఉల్కలా దూసుకెళ్తోంది విమానం. మంటలు కాబిన్లోకి ప్రవేశించాయ్.

ఇహ లాభం లేదని అర్థమైంది ప్రతాప్కి.

క్రిందకు చూసాడు. పర్వతాలు, లోయలు, దట్టమైన అడవి కన్పించాయ్.

ఏదో చెయ్యాలి తను. మిగ్ ఆకాశంలోనే మండి పోయి ప్రేలిపోవటానికి ఎక్కువ సమయం పట్టదు. ఇటు వంటి పరిస్థితి ఇంతవరకు తనకు ఎదురుకాలేదు. మిస్టర్ చందూర్! మీకు రేపటినుంచి అసిస్టెంట్ ఉండడు. అయాం వెరీ సారీ!

ప్లేన్ని డౌన్ చెయ్యాలని చూసాడు. నోస్ డైవ్ అయ్యింది. వెంటనే సర్రున దూసుకెళ్ళసాగింది రాకెట్లా భూమ్మీదకు.

డోర్ తెరిచాడు ప్రతాప్. అరక్షణమైనా ఆలస్యం చెయ్యకుండా ప్లేన్లోంచి తలక్రిందులుగా జారిపోయాడు.

అతన్ని దాటి కొంతదూరం ముందుకు వెళ్ళి, అంతలోనే తిరిగి నేలమీదకు తలక్రిందులుగా జారిపోతూ భగ్గున మండిపోయింది మిగ్. ఆకాశంలో పెద్ద విస్ఫోటం!

దాదాపు ఐదువేల అడుగుల ఎత్తునుంచి క్రిందకు జారి పోతున్న ప్రతాప్ గుండెలు నిమిషానికి 144 సార్లు కొట్టు కుంటున్నాయ్.

క్రింద ఏవో పర్వతాల మధ్య నల్లటి లోయ వికృతంగా కన్పిస్తోంది. గాలి వేగానికి చెవులు హోరెత్తిపోతున్నాయ్.

చటుక్కున గాల్లో బేలన్స్ సరిచేసుకొని పల్టీ

కొట్టాడు ప్రతాప్. స్పీడ్ కాస్త కట్ అయ్యి, తిరిగి అంతలోనే రైజ్ అయ్యింది.

మళ్ళీ అంతలోనే తలక్రిందులుగా జారిపోతున్నాడు క్రిందకు. అతి కష్టంమీద రెండవ పల్టీ కొట్టాడు.

అప్పటికే భూమికి పదిహేనువందల అడుగుల ఎత్తు వచ్చేసాడు.

లోయ ఎంత లోతు వుందో తెలియదు. మూడవ పల్టీ కొట్టిన తర్వాత అతని కళ్ళకు ఏదో చిన్న జలపాతం లాంటిది కన్పించింది.

చాలా ఎత్తునుంచి క్రిందకు జారిపోతున్న నీరు పొగ మంచులాగా కన్పించింది.

ఉత్సాహంగా నాల్గవ పల్టీ కొట్టాడు ప్రతాప్. ఐదు...ఆరు...ఏడవ పల్టీ కొట్టి, అదృష్టం నవ్వకపోవ టంతో పెద్ద నీటిమడుగులోకి తలక్రిందులుగా దూసుకు పోయాడు.

నిమిషం తర్వాత వాటర్ సర్ఫేస్‌మీదకు వచ్చాడు. జలపాతం హోరు దూరంనుంచి అస్పష్టంగా విన్పిస్తోంది.

చకచక ఒడ్డుకు ఈదుకొచ్చాడు ప్రతాప్.

మడుగు ఒడ్డునే వున్న రాతిబండమీద వెల్లకిలా పడు కొని పావుగంటపాటు విశ్రాంతి తీసుకున్నాడు. అతని బ్లడ్‌ప్రెషర్ మామూలు స్థాయికి చేరుకుంది. హృదయ స్పందన వేగం సైతం మామూలుగా మారింది.

లేచి కడుపునిండా నీరు తాగాడు ప్రతాప్. దుస్తులు తీసి, నీరు పిండివేసి, తిరిగి అవే ధరించాడు. అప్పుడు తెల్సిందతనికి తన రివాల్వర్ ఎక్కడో పోయిన విషయం.

చేజారిపోయిన రివాల్వర్ గురించి చింతిస్తూ కూర్చొ

వటం అవివేకం! లోయ వెంబడే కొంతదూరం నడిచి, అడవి తీగల సహాయంతో పైకొచ్చాడు. మరొక్క అర గంటలో భయంకరమైన కీకారణ్యంలో ప్రవేశించాడు.

5

సూర్యుడు పడమటి కొండల చాటుకు చేరుకున్నాడు. పడమటి దిక్కున ఎర్రగా మెరుస్తోంది ఆకాశం. గాలి నెమ్మదిగా వీస్తోంది.

వన్యమృగాల అరుపులు ఆగి ఆగి విన్పిస్తున్నాయ్. కోతుల కిచకిచలు పోనుపోను అధికంగా విన్పించసాగాయ్.

అడవుల్లో ప్రమాదాలు అన్నివైపులా పొంచివుంటాయని ప్రతాప్‌కి తెల్సు. ఆత్మరక్షణకోసం బూట్‌లో దాచుకున్న డాగర్ తీసి చేత్తో పట్టుకున్నాడు. అదొక్కటే అతని వద్దనున్న ఆయుధం ప్రస్తుతం.

ప్రయాణం ఎటువైపు సాగుతున్నదో తెలియదు.

కంపాస్ లేకుండా అడవుల్లో ప్రయాణించటంవలన అనేక ఇబ్బందులున్నాయ్. దారి తప్పే ప్రమాదం అటుంచి, తిరిగిన ప్రదేశాల్లోనే మళ్ళీ మళ్ళీ తిరగటం కూడా సంభవిస్తుంటుంది. అడవుల్లో కాలిబాటలన్నీ ఇంచుమించు ఒకే విధంగా ఉండటమే అందుకు కారణం.

హఠాత్తుగా జాగ్వార్ పులి గాండ్రింపు విన్పించింది.

అదిరిపడి చటుక్కున ఆగిపోయాడు ప్రతాప్.

ఇంతలో జాగ్వార్ అతని ఎదుట ప్రత్యక్షమైంది. ప్రక్కనే వున్న పొదల్లోంచి అది వచ్చిన తీరు, ప్రస్తుతం ఆ క్రూరజంతువు తోకను నేలకేసి బాదుతూ మధ్యమధ్య నోరు పూర్తిగా తెరిచి, భీకరంగా గాండ్రించటం

చూస్తుంటే ప్రతాప్ బ్లడ్ ప్రెషర్ తిరిగి పెరిగింది.

జాగ్వార్‌ని చిన్న డాగర్‌తో ఎదిరించటం మాటలు కాదని అతనికి తెలుసు. రాతిబొమ్మలా నిలబడుండి పోయాడు.

చిఱుతపులి నాలుగు అడుగులు వెనక్కి నడిచింది.

హఠాత్తుగా గాండ్రించి, మెరుపువేగంతో గాల్లో కెగిరి ప్రతాప్ మీదకు దూకింది.

6

సిగరెట్ వెలిగించుకుని, ఆరిపోయిన అగ్గిపుల్లను ఏష్ ట్రేలో పడేసాడు చందూర్. సిగరెట్టును నుసిగా మార్చేస్తూ గదిలో పచార్లు ప్రారంభించాడు.

అంతక్రితమే సాలిస్‌బరి నగరంలో పలుప్రాంతాలు తిరిగివచ్చాడు చందూర్. ఎక్కడ చూసినా అల్లర్లు, గొడవలు, లాఠీఛార్జీలు, బాష్పవాయుప్రయోగాలు కన్పించాయ్.

ఓ చోట నలుగురు నీగ్రో విద్యార్థినులు చందూర్ మీదకు రాళ్ళు విసిరారు, అతన్ని శ్వేతజాతీయునిగా ఎంచి. ఇంతలో పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకోవటంతో డిటెక్టివ్ దుస్తులకుగాని, ఒంటికిగాని ఎటువంటి డామేజీ జరుగలేదు.

ఇహ రోడ్లు సర్వే చేయటం ఆరోగ్యానికి ఏమంత మంచిది కాదని అన్పించి, వెనుదిరిగి వచ్చేసాడు.

ఆలోచనలతో డిటెక్టివ్ మస్తిష్కం వేడెక్కి పోతోంది.

వరుసగా మూడు సిగరెట్లు నుసిచేసాడు చందూర్. గిర్రున వెనుదిరిగి బల్ల దగ్గరగా వెళ్ళాడు. బల్లమీద టెలిఫోన్ ఉంది.

"మిస్టర్ చందూర్! రిసీవర్‌ని రెస్ట్‌మీద పడెయ్!" కటువుగా విన్పించింది వెనుకనుంచి.

పెదవులు బిగించాడు డిటెక్టివ్. మౌనంగా రిసీవర్‌ని క్రెడిల్ చేసి, నెమ్మదిగా వెనక్కి తిరిగాడు.

గుమ్మంలో ఏడడుగుల నీగ్రో కన్పించాడు. పాంటు మాత్రమే ధరించాడతను. మిగిలిన శరీరమంతా నగ్నంగా ఉంది. కసరత్తుచేసి పెంచాడేమో కండలు మెలితిరిగి ఉన్నాయ్. నల్లటి ముఖంలోని కనుగుడ్లు ఎర్రగా మండుతున్నట్టు కన్పిస్తున్నాయ్.

48 ఆటోమేటిక్ అతని కుడిచేతిలో ఉంది. దాన్ని అతను పట్టుకున్న తీరు డిటెక్టివ్‌ని కలవరపరుస్తోంది. ప్రత్యర్థి అలాంటి మారణాయుధాలు ఉపయోగించటంలో మంచి అనుభవం కలిగివున్నాడని అర్థంచేసుకున్నాడు.

"చందూర్ ఎవరు?" హఠాత్తుగా ప్రశ్నించాడు. "ఇంతకూ నీవెవరు?"

అతను ముందుకొచ్చాడు. డిటెక్టివ్‌కి రెండు గజాల దూరంలో ఆగిపోయాడు.

"చందూర్ నేను కాదు. ఈ గదిలో ఉన్నది మనం యిరువురు మాత్రమే! ఇహ పోతే నీ రెండో ప్రశ్నకు సమాధానం విను. అయాం అబ్రన్...డాబూ అబ్రన్. మేడమ్ దయానా మనిషిని..." మాటలు ఆపేసి పాంటు జేబులోంచి ఏదో టాబ్లెట్ తీసి డిటెక్టివ్ మీదకు విసిరాడు. "దాన్ని మింగాలి నువ్వు."

డిటెక్టివ్ ఛాతీని తాకి క్రింద పడిపోయింది టాబ్లెట్. కనురెప్పలు కూడా కదిలించలేదు డిటెక్టివ్.

"మిస్టర్ అబ్రన్! చందూర్‌ని తక్కువగా అంచనా

వేసుకున్న ప్రతి వ్యక్తీ ఘోరంగా భంగపడ్డాడు...''
''షటప్! చెప్పింది చెయ్.''

చటుక్కున ప్రత్యర్థిమీదకు దూకుతున్నట్టు నటిస్తూ ప్రక్కకు జారిపోయాడు డిటెక్టివ్. 'ధన్...'మంటూ ప్రేలింది. 48 బుల్లెట్ ఎదురుగానున్న గోడకు గుద్దుకుంది.

జరిగిన మోసం అర్థమై రెండవసారి ట్రిగ్గర్ నొక్క బోయాడు అబ్రన్.

అప్పటికే సమయం మించిపోయింది. అతడి కుడిచేతి మణికట్టుమీద బలమైన బూట్ కాలు దెబ్బ పడింది. 48 ఎగిరిపోయి నేలమీద పడిన వెంటనే ''ఖంగ్...'' మంటూ చప్పుడు చేసింది.

స్ప్రింగ్ లా లేచి నిలబడ్డాడు డిటెక్టివ్.

రెండడుగులు వెనక్కు నడిచాడు అబ్రన్. వికృతంగా నవ్వి చేతులు ముందుకు చాచాడు. పిడికిళ్ళు బిగిస్తూ అంత లోనే విడదీస్తూ మళ్ళీ నవ్వాడు కర్ణకఠోరంగా.

ప్రత్యర్థి జెయింట్ బాక్స్ కి సిద్ధమయ్యాడని అర్థమైంది చందూర్ కి.

జెయింట్ బాక్స్ తెల్సిన వ్యక్తితో మామూలుగా పోరాడి ప్రయోజనం ఉండదు. జపానీస్ జూడో, ఆఫ్రికన్ కరాటే, భారతీయుల మల్లయుద్ధం, మంగోలియన్ యన్ బాక్స్, చైనీస్ చుడో వగైరాలు జెయింట్ బాక్స్ ముందు నిలబడలేవు. భయంకరమైన ఫైట్ అది. ఒకే ఒక బాక్స్ తో మనిషి ఈ లోకాన్ని వదిలేస్తాడు.

ప్రత్యర్థిని తక్కువగా అంచనా వేసుకోలేదు డిటెక్టివ్. రక్తాన్ని గడ్డకట్టించే మాస్టర్ బాక్స్ అరుపు అరిచాడు. అరుస్తూ సింహంలా ముందుకు దూకాడు. దూకుతూ

పిడికిలిని బలంగా ప్రత్యర్థి కడుపుమీదకు విసిరాడు.

అప్పటికే అబ్రన్ చేతులు డిటెక్టివ్ భుజాలను తాకాయ్. ఇంతలో చంద్రూర్ పిడికిలి అబ్రన్ కడుపులో దూరింది.

భయంకరమైన అబ్రన్ గావుకేకకు ఆ గది గోడలు అదిరాయ్ క్షణకాలం.

ప్రత్యర్థి కడుపులో రిస్ట్‌వరకు జొరబడుతున్న తన కుడి చేతిని వెనక్కి లాగేసుకున్నాడు డిటెక్టివ్. ఆ చేయి ఒంటరిగా బయటకు రాలేక అబ్రన్ ప్రేవుల్ని కూడా బయటకు లాక్కొచ్చింది. అప్పుడు–ఆలస్యంగా అర్థమైంది డిటెక్టివ్‌కి తన చేతులు రెండూ పెరాలసిస్ వచ్చినట్లు వ్రేలాడిపోతున్న సంగతి.

దబ్బున వెనక్కి విరుచుకపడ్డాడు అబ్రన్. భీకరంగా మూలుగుతూ, పిడికిళ్ళు బిగించి నేలను గుద్దుతూ తల అటు ఇటు వూపుతున్నాడు.

గాయంలోంచి విపరీతంగా స్రవిస్తోంది రక్తం. అతను కదులుతుంటే అతని కడుపుమీద, నేలమీద పడున్న ప్రేవులు బరువుగా కదులుతున్నాయ్ పాపం!

చేతులు స్వాధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించాడు చంద్రూర్. స్వాధీనం కాలేదు. తోటకూరకాడల్లా వ్రేలాడిపోతున్నాయ్ రెండూ.

తన అదృష్టం బాగానే ఉంది. బలమైన జెయింట్ బాక్స్ తలమీద పడివుంటే తల కొబ్బరికాయ పగిలినట్లు పగిలివుండేది. గ్రుడ్డిలో మెల్ల మేలు అన్నది ఇలాంటిదే అయ్యుంటుంది అనుకున్నాడు.

తన స్వాధీనంలో లేని చేతులు తిరిగి మామూలు స్థితికి

రావటానికి కనీసం నాలుగు గంటలైనా అవసరమని డిటెక్టివ్‌కి తెలుసు.

చేతులు పనిచెయ్యకపోవటంతో ముందుకు కదిలాడు డిటెక్టివ్. నిర్దయగా ప్రత్యర్థి కంఠంమీద తన్నాడు.

సృష్టి దద్దరిల్లేలా కేక పెట్టబోయాడు అబ్రన్. అతని ప్రయత్నం ఫెయిల్ అయ్యింది. కంఠనాళాలు దెబ్బ తిన టంతో శబ్దం అక్కడే సుడులు తిరిగిపోయింది.

తిరిగి కాలెత్తాడు డిటెక్టివ్.

"శ్రీధర్!" కటువుగా విన్పించింది గుమ్మంలోంచి.

అబ్రన్‌ని తన్నటం మానేసి గుమ్మంవైపు చూసాడు డిటెక్టివ్. చేతులు వెనక్కు విరిచి కట్టబడిన జెనీసా, ఆమె వెనుక లైట్ మెషిన్‌గన్‌తో నిలబడున్న యూరోపియన్ వృద్ధుడొకడు కన్పించారు.

వెక్కి వెక్కి ఏడుస్తోంది జెనీసా. బిగ్గరగా ఏడవటానికి ఆమెకు ధైర్యం చాలటంలేదు. ఏడుపును బలవంతంగా దిగమ్రింగుకున్నప్పుడు కూడా వెక్కిళ్ళు రావటం జరుగు తుంటుంది.

మౌనంగా జడపదార్థంలా ఉండిపోయాడు డిటెక్టివ్.

7

గాలివేగంతో నేలమీదకు జారిపోయి, జాగ్వార్ మొదటి ప్రయత్నాన్ని వృధా చెయ్యటంతోబాటు దాన్ని గాయపర్చగలిగాడు ప్రతాప్.

పట్టు చిక్కకపోవటంతో ప్రతాప్ మీదనుంచి అవతలకు దూకేసింది పులి. అదే సమయంలో దాని డొక్కలో దిగబడింది డాగర్.

జాగ్వార్ శరీరంలో జొరబడిన డాగర్‌ని వెనక్కు

లాక్కోవాలని చూసాడు ప్రతాప్. అతని అంచనా పారబాటైంది. సమయం చాల్లేదు. తన ఒంట్లో దిగిన డాగర్‌తో సహా అవతలకు దూకేసింది జాగ్వార్.

దడదడలాడే గుండెలతో లేచి నిలబడ్డాడు ప్రతాప్. భీకరంగా గాండ్రిస్తూ గిర్రున ఇటు తిరిగింది పులి. తిరిగి గాండ్రించింది.

ఒట్టి చేతుల్తో జాగ్వార్‌ని ఎలా ఎదుర్కోవటం? పారి పోవటానికి లేదు. పారిపోతే జాగ్వార్ వదిలెయ్యదు. ఆలోచనల్ని ఆపుకుంటూ మొండిధైర్యంతో నిలబడుండి పోయాడు.

రెండడుగులు నడిచి ఆగిపోయింది జాగ్వార్. కర్ణకఠో రంగా గాండ్రించింది.

దాని చూపుల్లో చూపులు కలిపి, కనురెప్పలార్పటం మర్చిపోయి రాతివిగ్రహంలా నిలబడున్నాడు ప్రతాప్.

భూమిని కాళ్ళతో తన్ని గాల్లో కెగిరింది పులి. అదే సమయంలో "జుంయ్..."మనే విచిత్ర ధ్వనితో గాలిని చీల్చుకుంటూ దూసుకొచ్చిన బాణం "చక్..."మంటూ ఆ జంతువు కంఠంలో దూరింది.

ఇంతలో ప్రతాప్ మీద విరుచుకుపడిందా జంతువు. దబ్బున వెనక్కి పడ్డాడు ప్రతాప్. తన కంఠం కొరి కెయ్యాలని చూస్తున్న పులి కళ్ళను బొటనవేళ్ళతో పొడిచాడు.

జాగ్వార్‌కి ఎడమకన్ను పోయింది.

ప్రతాప్ కుడిచేతి బొటనవ్రేలు కదిలినంత చురుగా ఎడమచేతి బొటనవ్రేలు కదలకపోవటంతో జాగ్వార్‌కి ఒక కన్ను మిగిలిపోయింది.

ప్రత్యర్థిని వదిలి ఎనిమిది అడుగులు వెనక్కి నడిచింది పులి. చెప్పలేనంత కోపం కల్గుతోంది దానికి.

ఒక కన్ను పోవటంతోబాటు శరీరంలో ఒక బాణం, మరొక డాగర్ దిగబడివుండటంతో ఎప్పుడూ ఏ క్రూర మృగానికీ రానంత ఆగ్రహం కల్గుతోంది!

పులి చూపులు తీక్షణంగా ఉన్నాయ్. మిగిలివున్న కంటితో ప్రతాప్ పీకను వెదుకుతోంది.

అప్పటికే లేచి సిద్ధంగా ఉన్నాడు ప్రతాప్.

ఆ పరిసర ప్రాంతాలు దద్దరిల్లేలా ఓసారి గాండ్రించింది జాగ్వార్. చటుక్కున గాల్లోకి లఘించింది.

అదే సమయంలో తుమ్మెద ఝుంకారాన్ని గుర్తుకు తెప్పిస్తూ వెంటవెంటనే రెండు బాణాలు దూసుకొచ్చి పులి ముఖంలో జొరబడ్డాయ్.

తనకు ఎవరో సహాయపడ్తున్నట్టు ఆలస్యంగా అర్థమైంది ప్రతాప్‌కి. ఈసారి పులిని ఎదుర్కోవటం మాని, మెరుపువేగంతో ప్రక్కకు గెంతేసాడు.

గాల్లోకి ఎగిరిన పులి నేలను తాకింది. రెండు క్షణాల్లో మరో రెండు బాణాలు దాని కంఠంలో జొరబడ్డాయ్.

పులి గిల గిలా తన్నుకుంది. గాయాల్లోంచి ఆగకుండా స్రవిస్తూంది రక్తం. దాని శరీరంలో దిగిన బాణాలు విష పూరితం కావటంతో ఆ జంతువు బలం క్షణక్షణానికి క్షీణించిపోతోంది.

ప్రతాప్ చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు.

జాగ్వార్ భీకరంగా గాండ్రిస్తూ, తోకతో నేలను బాదుతూ, కాళ్ళతో భూమిని అదరగొడుతూ నానా గొడవ చేయసాగింది. దాని జీవాత్మ భౌతిక దేహం నుండి

బయట పడటానికి తంటాలు పడుతోంది.

ముందుకు కదిలాడు ప్రతాప్. జాగ్వార్ శరీరంలో దిగి వున్న తన డాగర్ అందుకుని, దానిని అంటివున్న రక్తాన్ని జాగ్వార్ శరీరానికే తుడిచేసి, డాగర్ని బూట్లో దాచుకున్నాడు.

"నాకు సహాయం చేసిన వారెవరో దయచేసి కన్పించండి. కృతజ్ఞతలు చెప్పుకునే అవకాశం నాకు కల్పించండి!"

ప్రతాప్ మాటలకు కిల కిలా మంటూ నవ్వు విన్పించింది ఓ చెట్టు చాటునుంచి, వెంటనే ఓయువతి ప్రత్యక్షమైంది.

ఆమెను పరిశీలనగా చూసాడు ప్రతాప్.

ప్రతాప్ చూపుల్లో చూపులు కలుపుతూ అందంగా నవ్విందామె. వయసు రెండు పదులకు మించి వుండదు. ఒంటిరంగు నలుపే అయినా నలుపులో ఏదో మెరుపుంది.

వెంట్రుకలు వెనక్కు విరబోసుకునుంది. తలపై రంగు రంగుల ఈకలు అలంకరించుకుని, మెడలో ఆకాశం రంగు పూసల దండలు ధరించింది. వక్షోజాల మీద ఎటువంటి ఆచ్ఛాదనా లేదు. నడుముకు జింక చర్మము చుట్టుకుంది. ఎడమ చేతిలో విల్లు వుంది. వీపుకు అంబుల పొది అడవి తీగలతో బిగించుకునుంది.

ఆ ఆటవిక స్త్రీ ప్రతాప్ ముందుకొచ్చి, అతనికి తెలియని భాషలో ఏదో అడిగింది.

నవ్వాడు ప్రతాప్. "నీ మాటల్లో ఒక్క అక్షరమైనా నా కర్థం కాలేదు" అన్నాడు స్వచ్ఛమైన తెలుగులో.

ఆవిడ ప్రతాప్ ముందు మోకాళ్ళపై చతికిల బడింది.

"సోయా...సోయా...సోయా" అంటూ ముమ్మారు తల వంకించింది.

ఆమె జబ్బ పట్టుకొని లేవదీసాడు ప్రతాప్. "ఇది ఏ ప్రాంతం?"

ఆమె ఓరగా ప్రతాప్ ముఖంలోకి చూసింది. అతని చేతిలో యిరుక్కునున్న తన జబ్బను సున్నితంగా విడదీసుకొని, చావు బ్రతుకుల మధ్య గింజుకుంటున్న జాగ్వార్ వైపు కదిలింది.

ప్రతాప్ కర్తవ్యం తెలియని అమాయకునిలా నిలబడున్నాడు.

ఆమె, పులి శరీరంలో జొరబడున్న బాణాన్ని ఒక్కొక్కటే లాగేస్తోంది. లాగేసిన బాణాల్ని అంబులపొదిలో దాచుకుంటోంది.

జాగ్వార్ ఆఖరు శ్వాస వదిలేసింది.

ఆమె వెనుదిరిగి ప్రతాప్‌ను సమీపించింది, అతని చేయి అందుకొని తన వెంట రావల్సిందిగా సైగ చేసి చెప్పింది.

అర క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చి, ఆమె వెంట బయలుదేరాడు ప్రతాప్.

8

బధ్ధకంగా తల అటు యిటు కదిలించాడు చందూర్.

కన్ను రెప్పల మీద టన్ను బరువు వుంచినట్టుగా అనిపిస్తోంది. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

ఏదో దుర్వాసన ముక్కు పుటాల్ని బ్రద్దలు చేస్తోంది. రాతి గోడలు దృఢంగా కన్పిస్తున్నాయి. చమురు దీపం ఒక మూలగా వుంది. దాని వెలుగు సరిగా లేదు.

నెమ్మదిగా లేచి కూర్చున్నాడు చందూర్.

చేతులు రెండూ తన స్వాధీనంలోకి వచ్చినట్లు అర్థ మైంది. అయినా భుజాలు ఇంకా బాధపెడుతూనే వున్నాయ్. లేచి నిలబడి చేతుల్ని విదిలించాడు.

అప్పుడు చూసాడు, ఒక ప్రక్కగా పడున్న జెనీసాని చక చక దగ్గరగా వెళ్ళాడు.

"జెనీసా..." భుజం పట్టుకుని కుదుపుతూ నాలుగైదు సార్లు పిలిచాడు. లాభం లేకపోయింది. మత్తుగా నిద్ర పోతూనే వుందామె.

జరిగిపోయిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తు కొస్తున్నాయ్ చందూర్ కి. యూరోపియన్ వృద్ధుని రూపం కళ్ళముందు మెదిలింది.

వృద్ధుడు బలవంతంగా తనకు మత్తుమాత్రలు మింగిం చాడు. ఆ తర్వాత ఏమైంది? ఇది ఏ ప్రాంతం? తను రొడీ షియాలోనే వున్నాడా? అసలు యిది ఆఫ్రికా ఖండమే కాదేమో!

వాచీలో టైం చూసుకోబోయాడు డిటెక్టివ్. వాచీ లేదు.

పాంటు జేబుల్లో తడుముకున్నాడు. ప్రత్యర్థులు తన వద్ద గుండుసూదికూడా మిగల్చకుండా తీసేసుకున్నారని తెల్సుకున్నాడు.

పన్నెండు అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పు కల్గిన ఆ గది గోడల్ని మరొకసారి పరిశీలించి చూసాడు. ఒకవైపు గోడకు పది అడుగుల ఎత్తులో వుంది చిన్న వెంటిలేటర్ ఒకటి.

గది నేల దుమ్ము ధూళితో నిండివుంది. ఒకచోట ఏవో టైర్లు, చెక్కపెట్టెలు పడున్నాయ్. అటువైపు

వెళ్ళి చెక్కు పెట్టెలు ఖాళీవని తెల్సుకున్నాడు.

ఉడెన్ డోర్‌ని లాగి చూసాడు. అది బయట తాళం వెయ్యబడిందని అర్థమైంది. కారు నిలుపుకోవటానికి ఉపయోగించే గారేజ్‌లా వుందా గది.

ఇది పగలు కాదు. రాత్రే! టైం తెలియటం లేదంతే! ప్రత్యర్థులు తన్ను తక్కువగా అంచనా వేసుకున్నారు. ఇప్పటివరకు తను ఊహించినట్టే జరిగింది. ఇహ సైంటిస్ట్ విషయం మాత్రమే మిగిలివుంది.

గదిలో పచార్లు ప్రారంభించాడు డిటెక్టివ్. అంత క్రితం జెనీసాతో గడిపిన ప్రణయ క్రీడలు గుర్తొచ్చాయ్. మగాణ్ణి ఉద్రేకపర్చటంలో, ఆ తర్వాత తృప్తిపర్చటంలో ఆమెకు ఆమే సాటి! నవ్వుకున్నాడు.

హఠాత్తుగా గదితలుపు తెరుచుకుంది.

డిటెక్టివ్ పచార్లు మాని గుమ్మంవైపు చూసాడు.

యూరోపియన్ వృద్ధుడు, మరో యిద్దరు నీగ్రో యువకులు లోనికొచ్చారు.

వృద్ధుడు ఆజ్ఞాపించాడు. నీగ్రో యువకుల్లో ఒకడు జెనీసావైపు కదిలాడు. రైఫిల్ భుజానికి తగిలించుకుని చేతిలోని వాటర్ బాటిల్ మూత తీసి, బాటిల్లోని నీరు మొత్తం జెనీసా ముఖంమీద గుమ్మరించాడు.

మత్తుగా మూల్గి, తల అటు యిటు కదిలించింది జెనీసా.

ప్రత్యర్థుల చర్యల్ని మౌనంగా గమనిస్తున్నాడు చందూర్.

9

చందూర్, జెనీసా ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు.

వారి వెనుక రైఫిల్స్ ధరించిన నీగ్రో యువకులు

అడుగులేస్తున్నారు. అందరికంటే ముందు వృద్ధుడు వెళ్తున్నాడు.

ఎదురుగా అధునాతన పద్ధతిలో నిర్మింపబడిన రెండు అంతస్తుల భవనం వుంది.

భవనం ముందు విశాలమైన ఖాళీస్థలం వుంది. దాని మధ్యలో చిన్న రన్ వే నిర్మింపబడింది. రెండు సింగిల్ యింజన్ విమానాలు రన్ వేమీద ఆగివున్నాయ్.

చందూర్, జెనీసా భవనంలోకి ప్రవేశపెట్టబడ్డారు. వృద్ధుడు యిటు తిరిగేసరికి ఇద్దరూ ఆగిపోయారు.

విశాలమైన హాలు అది. నేల కన్పించకుండా ఎర్రటి తివాసీ పరచబడింది. ఒకప్రక్కగా చిన్న డయాస్ వుంది. దానిమీద యినుప టేబిల్, కుర్చీ వున్నాయ్.

డయాస్ కెదురుగానున్న గోడవారగా వరుసగా కుర్చీలు వేయబడ్డాయ్.

డయాస్మీదకు చేరుకొని కుర్చీలో కూర్చున్నాడు వృద్ధుడు. చందూర్ని, జెనీసాని గోడవారగానున్న కుర్చీల్లో కూర్చోవల్సిందిగా ఆజ్ఞాపించాడు.

నీగ్రో యువకులు గుమ్మం దగ్గర నిలబడ్డారు రాతి విగ్రహాల్లా.

ప్రత్యర్థుల కీలక స్థావరం అదేనని వూహించుకున్నాడు డిటెక్టివ్. భయంకరమైన అడవి మధ్యలో అత్యంత అధునికమైన భవనం...రన్ వే ... విమానాలు ... డయాసా! రియలీ యు ఆర్ ఎ బ్రిలియంట్!

వృద్ధుని పెదవులు కదిలాయ్. "మిస్టర్ చందూర్! మిమ్మల్ని చంపటం మాకిష్టంలేదు. మా ఆర్గనైజేషన్ మీ వంటివారిని చేర్చుకోవటానికి యిష్టపడుతోంది..."

ఆగాడు. "మీ సమాధానం ఏమిటి?"

చందూర్ సూటిగా చూసాడు వృద్ధుణ్ణి. "మిస్టర్ రాకోవ్! నువ్వు వృద్ధునివి కాదు. నీ వయసు పదహారు దాటలేదు. ఏమంటావ్?"

అదిరిపడ్డాడు వృద్ధుని రూపంలోనున్న రాకోవ్. "వాట్ ఎ బ్రిలియంట్ యూ ఆర్? ఈ విషయం మీకెలా తెల్సింది?"

"నాకు ఇంకా చాలా విషయాలు తెల్సు రాకోవ్! ఒక దేశ రహస్యాల్ని మరొక దేశానికి అమ్మి డబ్బు సంపాదించే వృత్తిలో అగ్రగణ్యుడు షోలెన్ టాకివా.

అతనికోసం ఇంటర్‌పోల్ వేట ప్రారంభించింది. క్రిమినల్స్‌కి పజిల్‌గా తయారైవున్న ఇండియన్ స్పెషల్ ఏజంట్ మిస్టర్ విక్రమ్ ఇంటర్‌పోల్ కోరికను కాదనలేక టాకివాకోసం హంటింగ్ మొదలుపెట్టాడు.

అరవై దేశాలు తిరిమి టోకివాను కుక్కను కాల్చినట్టు కాల్చేసాడు విక్రమ్. అతని ఆత్మశాంతికోసం డయానా తిరిగి విజృంభించింది. నిన్ను అడ్డుపెట్టుకుని ఆమె కథ నడిపిస్తోంది.

మిస్టర్ రాకోవ్! టోకివా నీ తండ్రి అనీ, డయానా, నీవు ఒకే రక్తం పంచుకు పుట్టారని తెలుసు నాకు."

ఎగశ్వాస పీల్చి వదిలాడు పదహారేళ్ళ రాకోవ్.

"మిస్టర్ చందూర్! మిమ్మల్ని గురించి మా సిస్టర్ చాలా చాలా చెప్పింది. ప్లీజ్ ...మా ఆర్గనైజేషన్‌లో సభ్యత్వం తీసుకోండి.

మీరు నాకు మాత్రమే విధేయులైవుంటారు. సంస్థకొచ్చే ఆదాయంలో పది పర్సెంట్ వాటా, నెలకు లక్ష

అమెరికన్ డాలర్లు జీతం మీకివ్వబడతాయ్. హైకమాండ్ ఆర్డర్స్‌ని మీరు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎదిరించకుంటే చాలు! బాగా యోచించి...వివేకంగా యోచించి సమాధానం ఇవ్వండి!''

చిన్నగా నవ్వాడు చందూర్. "రారోవ్! పిట్ట కొంచమైనా కూత ఘనంగానే వుంది. నా ప్రక్కనున్న జెనీసా ...ఇటువంటి ప్రాస్టిట్యూట్స్ అవసరం మీ సంస్థకు ఎందుకు కలిగింది?''

"ఆ విషయం మా సిస్టర్‌ని అడగాలి.''

తిరిగి నవ్వాడు డిటెక్టివ్. "ఈ జెనీసా మీ సిస్టర్ డయానా కాదా?''

తన ముందున్న బల్లమీద పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు రారోవ్.

10

గూడెంలో ఎటువైపు చూసినా కోలాహలంగా వుంది.

గూడెం మధ్యనున్న దేవతావిగ్రహం ముందు స్త్రీ పురుషులు గుంపులుగుంపులుగా కన్పిస్తున్నారు. స్త్రీలు బిగ్గరగా ఏవో పాటలు పాడుతున్నారు. మగవాళ్ళు లయబద్ధంగా డ్రమ్స్ వాయిస్తున్నారు. కుల పెద్ద కాబోలు... విగ్రహం ముందు నిల్చుని ఏవో మంత్రాలు వల్లిస్తున్నాడు.

నాయకుని గుడిసెలో అతని కూతురు సిగ్గుతో ముడుచుకుపోతోంది. ఆమెను ముస్తాబు చేస్తున్నారు నలుగురు యువతులు.

మరొక గుడిసెలో ప్రతాప్ పరిస్థితి మరీ ఘోరంగా వుంది. అతని దుస్తులు తీసివేసారు. జంతుచర్మాలతో, పక్షుల ఈకలతో అలంకరిస్తున్నారు.

మరొక ఘడియలో ప్రతాప్ వివాహం గూడెం నాయకుని కూతురితో జరుగనున్నది.

పచ్చివెలక్కాయ కంఠంలో ఇరుక్కున్నట్టు బాధ పడుతున్నాడు ప్రతాప్. అతను వూహించని పరిస్థితి ఎదురైంది. అక్కణ్నుంచి పారిపోవాలని చూస్తున్నాడు. సమయం అనుకూలించటంలేదు. ఆటవిక యువకులు అతణ్ణి వదలటంలేదు.

పావుగంట గడిచింది.

ప్రతాప్‌ని అలంకరించటం పూర్తయ్యింది.

మెరుపులా ఏదో యోచన ప్రతాప్ బుర్రలో మెరిసింది.

తన చుట్టూ వున్న ఆటవిక యువకులకు సైగచేసి చెప్పాడు, అందరినీ గుడిసెలోంచి బయటకు వెళ్ళమని, తను దైవప్రార్థన చేసుకోవాలని.

ఆటవిక యువకులు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. రెండు నిమిషాల తర్వాత అందరూ ఒక నిశ్చయానికి వచ్చి గుడిసెలోంచి బయటకు నడిచారు.

వెదురుబొంగుల తలుపు మూసి గడియ బిగించాడు ప్రతాప్. అతని గుండెలు దడదడలాడుతున్నాయ్.

పరిస్థితులు ఎదురుతిరిగినప్పుడు పాపపుణ్యాల గురించి యోచించటం మూర్ఖత్వం అవుతుందని అతనికి తెలుసు. గుండెను రాయిచేసుకొని గుడిసెలో వెలుగుతున్న చమురు దీపంవైపు అడుగులు వేసాడు.

క్షణాలు భారంగా కదులుతున్నాయ్.

గుడిసెకు నిప్పంటుకుంది.

గుడిసె బయటనుంచి కేకలు ప్రారంభమయ్యాయ్. ప్రతాప్ తలుపు తెరిచాడు. భయం నటిస్తూ గుడిసెలో ఒక ప్రక్క వదిగి నిల్చుండిపోయాడు.

ఆటవిక యువకులు ప్రతాప్‌ని గుడిసెలోంచి బయటకు లాక్కుపోయారు. మంటలు ఆర్పే ప్రయత్నాలు మొదలయ్యాయ్.

నిమిషాలమీద గూడెంలోని పిల్లలు, వృద్ధులు, ఆడ, మగ అందరూ మండుతున్న గుడిసె ముందు చేరిపోయారు. కేకలు, అరుపులు మిన్నుముట్టాయ్.

మంటలు విజృంభించాయ్. అందరూ చూస్తుండగానే మొదటి గుడిసె దగ్ధమైపోయి, మంటలు రెండో గుడిసె వైపు ప్రాకాయ్.

తన విషయం ఎవరూ పట్టించుకోవటం లేదని అర్థమైంది ప్రతాప్‌కి. నెమ్మదిగా చీకట్లోకి తప్పుకొని, నిమిషాలమీద అడవిలోకి ప్రవేశించాడు. ఆత్మరక్షణకు ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో ఓ గుడిసె చాటున చిక్కిన విరిగిపోయిన బరిసె తెచ్చుకున్నాడు.

చకచక నడుస్తున్నాడు ప్రతాప్. ప్రయాణం యెటు వైపు సాగుతున్నదో తెలియదు. వెనక్కి తిరిగి చూడకుండా అరుమైళ్ళ దూరం నడిచాడు.

హఠాత్తుగా "ఢన్ ..." మంటూ గన్ ప్రేలిన చప్పుడు దూరంనుంచీ విన్పించింది.

టక్కున ఆగిపోయాడు ప్రతాప్.

ఎవరు ప్రేల్చారు గన్? సమీపంలో ఎక్కడో నాగరికులు వున్నారు. ఎవరైనా వేటకోసం వచ్చారేమో!

మరొక దారివెంట వెళ్ళటం యిష్టంలేక గన్ ప్రేలిన చప్పుడు విన్పించిన దిశగానే ప్రయాణం సాగించాడు.

11

చందూర్ వైపు తల తిప్పి మందహాసం చేసింది, అప్పటి వరకు జెనీసాలా వ్యవహరించిన డయానా.

చటుక్కున కుర్చీలోంచి లేచి డయానా మీదకు చేరు కుంది. తన తమ్ముడు కూర్చునున్న కుర్చీప్రక్కనే నిలబడిం దామె.

"మిస్టర్ చందూర్! మీ మేధస్సు ఎలాంటిదో నాకు తెలుసు. అయినా నన్నెలా అనుమానించగలిగారో, తెల్సుకోలేక పోతున్నాను. అభ్యంతరం లేకుంటే చెప్పండి?" అడిగింది.

డిటెక్టివ్ పెదవులు కదిలించాడు. "మిస్ డయానా! మీ తండ్రి వివరాలు ఇంటర్‌పోల్ ఫైల్స్‌లో వున్నాయ్. ఆయన వివరాలు మాత్రమే కాదు, ఆయన కుటుంబ సభ్యుల వివరాలుకూడా ఆ శాఖ సేకరించింది. నీవు నీ సోదరునితో కల్సి రకరకాల నేరాలు చేస్తూ ప్రపంచ మంతా తిరుగుతున్న సంగతి ఇంటర్‌పోల్ ఏజంట్సుకి తెలుసు.

వారికి తెల్సిన సమాచారం ప్రకారం నీ పేరు క్లాసీ. డయానాలా క్రొత్త అవతారం దాల్చిన యువతి నీవే అయివుండాలని నేను ఈ ఎక్సైట్‌మెంటులో పాల్గొ న్నపుడే అనుమానించాను.

అంతక్రితం ఇంటర్‌పోల్ క్రైమ్స్ ఇన్వెస్టిగేటర్ - డయానాలా వ్యవహరిస్తున్న నీతో పరిచయం పెంచు కున్నాడు. నీ ఎడమచేతికి ఆరువ్రేళ్ళు వున్న సంగతి తెల్సుకుని హెడ్‌క్వార్టర్స్‌కి మెసేజ్ పంపించాడు. ఆ తర్వాత అతన్ని నీవు చంపేసావ్. అది వేరే విషయం.

నాకు తెల్సిన ప్రాస్టిట్యూటు జెనీసా యెడమచేతికి కూడా ఆరువ్రేళ్ళు వున్నాయ్. జెనీసా, డయానా అయి వుండాలని ఆ క్షణాల్లోనే అన్పించింది. అనుమానం తీర్చు

కోవటానికి సాలిస్‌బరి వచ్చాను. నా సందేహం తీరి పోయింది. అరవ వ్రేలును ఆపరేట్ చేయించుకున్నావ్. అది గమనించీ మౌనంగా వుండిపోయాను."

"ఎందుకు?" నవ్వింది డయానా వురఫ్ క్లాసీ. "మీకు కావల్సిన స్త్రీని నేనే అని తెలిసికూడా ఎందుకు ఊరుకున్నారు?"

"నువ్వు కిడ్నాప్ చేసిన భారత సైంటిస్ట్ విషయం తెల్సుకోవటానికి."

దీర్ఘంగా గాలి పీల్చి వదిలిందామె. "మిస్టర్ చందూర్! మన పరిచయం ఈ నాటిది కాదు. సైంటిస్ట్ నా ఆధీనంలో నున్నమాట నిజమే. గతం మర్చిపోదాం! మీతో చేయి కలపటానికి నేను యిష్టపడుతున్నాను."

తల అడ్డంగా ఊపాడు చందూర్. "నీవంటి ట్రబుల్ మేకర్స్‌ని ఏరివెయ్యటం నా వృత్తి. మనం ఒకేజాతి పక్షులం కాదు. ఒకే చెట్టుమీద నివసించటం జరగదు."

"ట్రబుల్ మేకర్స్..." ఒత్తి పలికిందామె. "నిజమే. ఎందరికో మేము ట్రబుల్ యిస్తున్నాం. ప్రస్తుతం నా అనుచరులు ప్రపంచం నలుమూలలా వున్నారు. ఇంకా మీవంటి మేధావుల అవసరం నాకెంతైనా వుంది. మిస్టర్ చందూర్! మీ కిష్టమైతే నాకు బాడీగార్డ్‌గా వుండండి. అనతికాలంలో వరల్డ్ గవర్నమెంటు స్థాపించటానికి ప్రయత్నిద్దాం!"

క్లాసీ జీవితాశయం ఎంతటి భయంకరమైనదో అర్థమైంది డిటెక్టివ్‌కి.

చటుక్కున జుత్తులో వ్రేళ్ళు దూర్చి చిన్న మెటల్ బాల్‌ని తీసాడు. మరుక్షణంలో మెటల్ బాల్ గుప్పుం

ముందు పడి బ్రద్దలైంది. విపరీతంగా పొగ బయలుదేరిం దక్కడ.

డిటెక్టివ్ లేచి డయాస్ వైపు పరుగెత్తాడు.

"ఢన్..." మంటూ ప్రేలింది రైఫిల్. బుల్లెట్ డిటెక్టివ్ భుజాన్ని రాసుకుంటూ వెళ్ళి గోడను గుద్దుకుంది.

"షూట్...కిల్ హిమ్..." అరుస్తోంది క్లాసీ.

గుమ్మంవద్ద నున్న నీగ్రో యువకులు గన్స్ ఉపయోగించలేక పోతున్నారు. పొగ వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మొదట రైఫిల్ ప్రేల్చిన వ్యక్తే తిరిగి ట్రిగ్గర్ నొక్కాడు.

"ఢన్..." మనే చప్పుడు ఆ కాంక్రీటు భవనంలో పిడుగుపాటులా ధ్వనించింది.

వెంటనే చావుకేక విన్పించింది.

కెవ్వున అర్చింది క్లాసీ.

12

దూరంగా కన్పిస్తున్న విద్యుత్ దీపాల మీద దృష్టి నింపి వేగంగా పరుగెత్తుతున్నాడు ప్రతాప్. విరిగిన బరిసెను గట్టిగా పట్టుకొని రకరకాల యోచనలతో దూసుకెళ్తున్నాడు.

భయంకరమైన క్రూర మృగాలతో అంతకంటే భయంకరమైన ఆటవికులతోను నిండిన అడవిమధ్య ఎలక్ట్రిక్ దీపాలు ఎలా వచ్చాయ్? గన్స్ ప్రేలుళ్ళని ఏ విధంగా వూహించుకోవాలి?

అనవసరమైన విషయాల్లో తల దూర్చటం వల్ల క్రొత్త ప్రమాదాలు ఎదురయ్యే ప్రమాదం వుంది. తను మృత్యు ముఖానికి వెళ్ళటం లేదు కదా!

ఆలోచనలతోబాటు పరుగుకూడా ఆపలేదు ప్రతాప్. మరో రెండు నిమిషాల తర్వాత కాంక్రీటు భవనం ప్రాంతాలకు వచ్చాడు.

విద్యుత్ ఉత్పత్తి చేసే జనరేటర్ చప్పుడు విన్పించి ఆగిపోయాడు. ఎగశ్వాస పీల్చి వదిలి, చెట్లు దాసుకుంటూ చీకట్లో ముందుకు కదలసాగాడు.

ఎత్తుగా వున్న ప్రహారీ గోడ గంభీరంగా కన్పిస్తోంది. దాని కటుప్రక్క నుంచి విన్పిస్తోంది జనరేటర్ పనిచేస్తున్న ధ్వని. రన్ వే మీద ఆగివున్న విమానాలు అస్పష్టంగా కన్పించాయ్ ప్రతాప్ కి.

అతని ఆలోచనలు మరో దారి పట్టాయ్.

మెయిన్ గేటుకు దూరంగా ప్రహారీ గోడను ఆనుకొని క్రీనీడలో నిలబడ్డాడు. ఇంటర్ పోల్ కి పజిల్ గా తయారై వున్న డయానా రహస్య కీలక స్థావరం యిది కాదని నమ్మకం ఏమిటి? అదే నిజమైతే తను సరైన చోటుకే వచ్చాడన్న మాట.

"హేండ్సప్!"

అదిరిపడి చేతులెత్తాడు ప్రతాప్. బరిసె అప్రయత్నంగా జారిపోయింది.

చీకట్లోంచి ముందుకొచ్చాడు జోమా. ఆటవిక యువకుని వేషంలో వున్న ప్రతాప్ ని పరిశీలనగా చూశాడు.

"ప్రతాప్! ఈ వేషం నీకు చాలా బావుంది" నవ్వాడు. "చేతులెత్తమని నేను యింగ్లీష్ లో చెప్పిన విషయం నువ్వు అర్థం చేసుకోగలిగి, ఆచరించగలిగావంటే అప్పుడే అనుకున్నాను, నువ్వు ఆటవిక యువకుడు కాదని. బైదిబై—ఎలా బ్రతికావ్?"

ఆఫ్రికన్ కోబ్రాలా బుస వదిలాడు ప్రతాప్.

"శాటిస్ఫైడ్ జోమా! నిరంతరం నీతిని వరించటానికే యిష్టపడుతుంటుంది విజయలక్ష్మి. నీ పాపం పండి పోయింది. అందుకే మనం తిరిగి కల్సుకోవటం జరిగింది."

క్రూరంగా నవ్వాడు జోమా. అతని చేతిలోని ఆటోమేటిక్ సేఫ్టీ కాచ్ క్లిక్ మంది.

"ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ. దేవుని మీద నమ్మకం వుందా?"

"అంతిమ దైవ ప్రార్థన చేసుకునే వాణ్ణి కాను నేను నీ చేతుల్లో చావటం నా కిష్టం లేదు."

మరొక అడుగు ముందు కొచ్చాడు జోమా. "ఇండియన్స్‌కి అరుపు లెక్కువని నాకు తెలుసు. అయాం వెరీ సారీ! యు ఆర్ గోయింగ్ టు డై..."

జోమా మాటలు పూర్తి కాక మునుపే మెరుపులా మెరిసాడు ప్రతాప్. భూమిని బలంగా కాళ్ళతో తన్ని స్ప్రింగ్‌లా పైకెగిరి కాంపౌండ్ వాల్ మీద నిలబడ్డాడు.

అదిరిపడి ట్రిగ్గర్ నొక్కేశాడు జోమా. అప్పటికే అటువైపు దూకేశాడు ప్రతాప్ ముందు వెనుకలు ఆలోచించకుండా. బుల్లెట్ అతని మీదనుంచి దూసుకుపోయింది—గాల్లోకి.

మెయిన్ గేటువైపు పరుగెత్తాడు జోమా.

గేటు ముందున్న సెక్యూరిటీ గార్డ్స్ రైఫిల్స్ సరి చేసుకున్నారు. జోమాని గుర్తించి తిరిగి కూల్ అయ్యారు.

"శత్రువు మన స్థావరంలోకి ప్రవేశించాడు. వెళ్ళండి వెతకండి...కన్పిస్తే నిర్దయగా కాల్చెయ్యండు......"

అరుస్తూ గేటు దాటి ముందుకు పరుగెత్తాడు శ్రీమా.

అతని వెనుకే దూసుకెళ్ళారు గార్డ్స్.

13

భవనం పై భాగంలోంచి రైఫిల్స్ ధరించిన క్లాసీ అను చరులు గబగబ క్రిందికు పరుగెత్తుకొస్తున్నారు. అపాయాన్ని సూచించే అలారం భవనంలోని అన్ని గదుల్లోనూ ఆగకుండా మ్రోగుతోంది.

కుర్చీలో వెనక్కు వాలిపోయి వున్నాడు రారోవ్. అతని నుదురుగుండా ప్రయాణం చేసింది బుల్లెట్. బుల్లెట్ చేసిన గాయం వికృతంగా నల్లగా కన్పిస్తోంది.

తమ్ముణ్ణి...తన తమ్ముణ్ణి ఆ స్థితిలో చూడవలసి వస్తుందని వూహించనైనా లేదు క్లాసీ. ఆమె మెదడు మొద్దుబారిపోయి చాలా సేపైంది. బల్లమీద, నేలపైన ఒలికిన రారోవ్ రక్తం చూస్తుంటే ఆమెకు దుఃఖం ఆగటం లేదు.

అప్పటికే ఆ హాల్ పొగతోనూ, క్లాసీ అనుచరులతోను నిండిపోయి వుంది.

"మిస్ డయానా వురఫ్ క్లాసీ..."లో గొంతుకతో చెప్పాడు చందూర్. "మర్యాదగా నీ అనుచరుల్ని లొంగి పొమ్మని చెప్పు! లేకుంటే మిగిలివున్న నీ ప్రాణాలుకూడా ఎలబడవు."

గిర్రున ప్రక్కకు తిరిగింది క్లాసీ. దట్టంగా వున్న పొగలో అస్పష్టంగా కన్పించింది చందూర్ ఆకారం.

"మిస్టర్ చందూర్ మీ నెత్తురు త్రాగేవరకు నా కోపం చల్లారదు..." కోపంతో కొబ్రాలా కాస్సేపు బుసలు కొట్టిందామె.

"శత్రువు నా ప్రక్కనే డయాస్ మీద వున్నాడు. నేను చచ్చినా పర్వాలేదు... ఫైర్!" అరిచేసింది.

రైఫిల్ బోల్టులు విచిత్రంగా చప్పుడు చేయసాగాయ్. "థన్... థన్... థన్..."మనే ధ్వనులు అధిక మయ్యాయ్ క్షణాలమీద.

భీకరంగా గావుకేక పెట్టాడు చందూర్. వెంటనే కంఠం మార్చి, క్లాసీ కంఠాన్ని అనుకరిస్తూ "శత్రువు చచ్చాడు" అంటూ అరిచాడు.

డిటెక్టివ్ ఎత్తు గ్రహించేసింది క్లాసీ. అయినా ఏం చెయ్యలేకపోయింది.

ఆమె నోరు డిటెక్టివ్ నొక్కేసి వున్నాడు. డయాస్ మీద వున్న బల్ల క్రిందున్నారు యిద్దరూ. క్లాసీ డిటెక్టివ్ చేతుల మధ్య ఒడ్డునపడిన చేపలా గింజుకుంటోంది.

కాల్పులు ఆగిపోయాయ్ తాత్కాలికంగా. క్లాసీ అనుచరులు డయాస్ వైపు పరుగెత్తుకొస్తున్నారు. వారి బూట్లు చేస్తున్న ధ్వని ఆ హాల్లో ప్రతిధ్వనిస్తోంది.

పొగ యింకా విడిపోలేదు.

క్లాసీ అనుచరులు ఒకరికొకరు గుద్దుకుంటూ అటు ఇటు తిరుగుతున్నారు. దగ్గరకుండా ఒక్కరైనా వుండలేకున్నారు. అందరి కళ్ళవెంబడీ వేడినీళ్ళు ఆగకుండా కారిపోతు న్నాయ్.

ఇద్దరు వ్యక్తులు హాల్లోంచి బయటకు వెళ్ళటం క్లాసీ అనుచరులు ఆలస్యంగా గమనించారు. ఆ ఇరువురిలో ఒక వ్యక్తి చందూర్. రెండో వ్యక్తి తమ యజమానురాలు అందరి గుండెలూ అదిరాయ్. రైఫిల్ బోల్టులు మూస్తూ గుమ్మంవైపు పరుగెత్తబోయారు. అప్పటికే ఆలస్యం అయి పోయింది. తలుపులు మూసుకుపోయాయ్.

14

భవనం కుడిప్రక్కనున్న గాజు కిటికీ భళ్ళున బ్రద్దలైంది. మరు నిమిషంలో ఓ ఆకారం పై అంతస్తునుండి పగిలిన కిటికీగుండా క్రిందకు దూకింది. ఆ ఆకారం చేతులు వెనక్కి విరిచి కట్టబడున్నాయ్.

అదే సమయంలో ఆ ప్రాంతానికి చేరుకున్న జోమా ఆ ఆకారాన్ని గుర్తించి తృళ్ళిపడ్డాడు.

"మై డియర్ ఇండియన్ సైంటిస్ట్! గెటప్...పిచ్చి వేషాలు వేసావంటే కాల్చేస్తాను. మర్యాదగా లేచి నిలబడు."

ఇండియన్ సైంటిస్ట్ భరద్వాజ బోర్లా తిరిగి, మొదట మోకాళ్ళమీద లేచి, ఆతర్వాత నింపాదిగా లేచి నిల్చున్నాడు. నడుము కలుక్కుమంది. ఆ బాధను గురించి యోచించకుండా దడదడలాడే గుండెలతో యిటు తిరిగాడు.

ఎదురుగా రివాల్వర్‌తో కాలరుద్రునిలా నిలబడున్న జోమా కన్పించాడు.

కసిగా నవ్వాడు జోమా. "పారిపోవటానికి సరైన సమయం ఎంచుకున్నారు. కాని, మీ ప్రయత్నం భగ్నమైంది. ఊ...అలాగే ముందుకు రండి!"

రెండడుగులు ముందుకేసాడు భరద్వాజ.

అంతే! జోమా నెత్తిన బలమైన దెబ్బ పడింది. పిడుగుపాటులాంటి దెబ్బ!

బిగ్గరగా అరవబోయి వ్యవధి చాలక కొండ చిలువలా మెలికలు తిరిగిపోతూ నేలకు ఒరిగిపోయాడు జోమా. అతని తల రెండుగా పగిలిపోయింది. చిక్కటి నెత్తురులో

అప్పటికే అతని దుస్తులు తడిసిపోయాయ్,

చేతుల్లోని రాతిబండను ప్రక్కన పడేసాడు ప్రతాప్. చటుక్కున ముందుకు దూకి సైంటిస్ట్, జోమాల మధ్య పడున్న రివాల్వర్‌ని అందుకున్నాడు.

సెక్యూరిటీ గార్డ్స్ యిద్దరూ అటువైపు పరుగెత్తు కొస్తున్నారు. జోమా అక్కడున్నారని వారికి తెలుసు. అందుకే రైఫిల్స్ ప్రేల్చకుండా దూసుకొస్తున్నారు.

అరక్షణమైనా ఆలోచించలేదు ప్రతాప్. వరుసగా రెండుమార్లు ట్రిగ్గర్ నొక్కాడు.

గార్డ్స్ వికృతంగా అరుస్తూ వెనక్కు విరుచుకు పడ్డారు.

"ప్రతాప్!"

తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు ప్రతాప్. అది చందూర్‌గారి కంఠమే. వేగంగా కదిలాడు శబ్దం విన్పించిన వైపు. ఏవో పూలచెట్ల చాటున కన్పించారు చందూర్, క్లాసీ.

"సర్, ఈవిడ..." ఆగాడు ప్రతాప్.

"డయానా వురఫ్ క్లాసీ. ఈ డెవిల్‌ని తీసుకెళ్ళి ఓ ప్లెయిన్‌లోకి చేర్చు మొదట. ఈమె అనుచరులు భవనం నిండా వున్నారు...మూవ్! సైంటిస్ట్ భరద్వాజకోసం తిరిగి నేను భవనంలోకి వెళ్ళాల్సి వుంది..."

"సర్...భరద్వాజగారు తప్పించుకున్నారు. ఇప్పుడు యిక్కడే వున్నారు" చెప్పాడు ప్రతాప్.

15

సైంటిస్ట్ భరద్వాజను తీసుకొని రన్‌వేమీద ఆగివున్న ప్లెయిన్స్‌వద్దకు వచ్చాడు ప్రతాప్. అదే సమయంలో

క్లాసీని తీసుకొని అక్కడకు చేరుకున్నాడు చందూర్.

సైంటిస్ట్ చేతులకున్న కట్లు విప్పేసి, వాటినే ఉపయోగించి క్లాసీ చేతుల్ని వెనక్కి విరిచి కట్టేసాడు ప్రతాప్.

ప్రతాప్ ప్లెయిన్ నోస్‌వైపు పరుగెత్తాడు. గట్టిగా తిప్పాడు ప్రొఫెల్లర్‌ని. రెండవసారి త్రిప్పిన వెంటనే స్టార్టయ్యింది యింజన్. అక్కడున్న రెండు విమానాలూ సింగిల్ యింజన్‌తో నడిచేవే.

"ధన్...ధన్..." మంటూ ప్రేలుళ్ళు ప్రారంభమయ్యాయ్. భవనం టెర్రస్‌మీదకు చేరుకొని రైఫిల్స్ ప్రేలుస్తున్నారు క్లాసీ అనుచరులు.

అప్పటికే సైంటిస్ట్‌ని, క్లాసీనీ ప్లెయిన్‌లోకి చేర్చి, తనూ చేరుకున్నాడు చందూర్. "ప్రతాప్! క్విక్..." అరుస్తున్నాడు.

రెండుక్షణాల్లో ప్లెయిన్‌లోకి చేరుకున్నాడు ప్రతాప్. చందూర్ అధ్వర్యంలో ప్లెయిన్ ముందుకు కదిలింది, రన్‌వే మీద.

భవనం పైభాగంలో నున్న క్లాసీ అనుచరులు హాండ్ గ్రనేడ్స్ విసిరారు. లాభం లేకపోయింది. రన్‌వేమీద పడి ప్రేలిపోతున్నాయ్ గ్రనేడ్లు.

మధ్యమధ్యలో రైఫిల్స్ గర్జిస్తున్నాయ్.

రన్‌వే చివరకు వెళ్ళి హాఠాత్తుగా గాల్లోకి లేచింది ప్లెయిన్. ఏటవాలుగా వెయ్యిఅడుగుల ఎత్తుకు దూసుకెళ్ళింది క్షణాలమీద.

లెఫ్ట్ బాంక్ టర్న్ చేసాడు చందూర్. ఇంజన్ ప్రతాప్‌కి అప్పగించాడు.

"ప్లెయిన్‌ని తిరిగి ఆ భవనంమీదకు తీసుకెళ్ళు"

అన్నాడు కాళ్ళకున్న బూట్లు విప్పదీస్తూ.

ఆశ్చర్యపోయింది క్లాసీ. ఏమిటి చందూర్ ఉద్దేశ్యం? పారిపోవటానికి అవకాశం చిక్కినా, తిరిగి మృత్యు ముఖానికి వెళ్ళటంలో డిటెక్టివ్ పథకం ఏమై వుండొచ్చు?

సైంటిస్ట్‌కి అసలు ఏమీ అర్థం కావటంలేదు.

ప్రతాప్ క్షణాలమీద ప్లెయిన్‌ని ట్రబుల్ మేకర్స్ కీలక స్థావరంమీదకు తీసుకొచ్చాడు.

ఒక బూట్‌ని ఏదో లాగేసి భవనంమీద పడేసాడు చందూర్. రెండో బూట్ రన్‌వేమీద ఆగివున్న మిగిలిన ప్లెయిన్ మీద పడి; వెంటనే బ్రద్దలైంది భయంకరంగా.

భవనంమీద పడిన బూట్ ఆ తర్వాత ప్రేలింది భూనభోంతరాళాలు దద్దరిల్లేలా.

ప్రతాప్ నడుపుతున్న ప్లెయిన్ అప్పటికే ఆ ప్రాంతం నుంచి దూరంగా వచ్చేసింది.

చందూర్ దూరదృష్టి యెలాంటిదో అర్థమైంది మిగిలిన ముగ్గురికీ.

ప్లెయిన్ వేగంగా ముందుకు దూసుకెళ్తోంది.

—: ఐ పో యిం ది :—